తొలితరం తెలుగు నవలల్లో స్త్రీల సమస్యలు

ప్రపంచ వ్యాప్తంగా, సంస్కార దిశగా తమ జాతి అభ్యున్నతి కోసం ఒక పక్క పోరాటం జరుగుతుంటే, అదేమీ పట్టించుకోకుండా, బూజుపట్టిన సంప్రదాయాల ఒరవడిలో కొట్టుకుపోతూ, దురాచారాలకు తలవంచుతూ, నాలుగు గోడల మధ్య మగ్గిపోతున్న స్త్రీ జాతిని మేలుకొలుపుతూ దేశంలోనూ, ప్రపంచంలోనూ, స్త్రీల విషయకంగా చోటు చేసుకుంటున్న పెనుమార్పులను వారికి తెలియజెప్పి, స్త్రీలను అభ్యున్నతి పథంలోకి చేయూతనిచ్చి నడిపే దృక్పథంతో, తొలితరం తెలుగు నవలా రచయితలు కొంత ప్రయత్నం చేశారు. వారిలో ముఖ్యులు కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీనరసింహం, చలం, శ్రీపాద మొదలైన వారు.

అనాటి సమాజంలో, బాల్య వివాహాలు, నిర్బంధ వైధవ్యం, కన్యాశుల్కం, వరకట్నం, నిరక్షరాస్యత, ఆర్థిక ప్రతిపత్తి లేకపోవడం, మత విధుల్లో బహిష్కరణ, సంఘంలో పంచములతో సమానమైన స్థాయిలో చూడబడడం, కుటుంబంలో అణచివేత, ఇంటి చాకిరీ- ఇవన్నీ స్త్రీలు ప్రముఖంగా ఎదుర్కొన్న సమస్యలు. ఈ సమస్యలను కందుకూరి వీరేశలింగం గారు తమ నవల, పత్రిక, నాటకం, కథ మొదలైన రచనా ప్రక్రియల ద్వారా చర్చకు తీసుకువచ్చి, స్త్రీలకు తమ స్వంత సమస్యల పట్ల ఒక అవగాహన కల్పించారు. స్త్రీలకోసమే వీరేశలింగం గారు వ్రాసినట్టుగా చెప్పుకొన్న 1884లో చంద్రమతీ చరిత్ర, 1887 సత్యసంజీవని, 1891లో సత్యరాజా పూర్వదేశ యాత్రలు, 1897లో రాసిన విక్టోరియా మహారాణి చరిత్ర, 1889లో రచించిన దేహారోగ్య ధర్మబోధిని, స్త్రీ నీతిదీపిక, సత్యద్రౌపదీ సంవాదము, మొదలైన వన్నీ పంతులుగారు స్త్రీల చైతన్యాన్ని ఆకాంక్షిస్తూ వ్రాసినవే.

'రాజశేఖరచరిత్ర' నవలలో స్త్రీలు ఆ కాలంలో అనుభవిస్తున్న అత్తింటి ఆరళ్ళు, కుటుంబాల్లో పురుషాధిక్యత, మూఢాచారాలు, సాంప్రదాయాలచాదస్తాలను పాటించడం, అవివేకంతో కాలాన్ని వృధా చేసుకోవడం, వీటన్నింటినీ మనసుకు హత్తుకునేలా వ్రాశారు. చిన్న వయసులోనే సౌభాగ్యం కోల్పోయి, వితంతువులుగా మారి, తోడబుట్టిన వాళ్ళ సంసారాలను నెత్తికెత్తుకుని రాత్రీ, పగలు ఇంటి చాకిరీతో మగ్గిపోయే జీవచ్ఛవాల దురవస్థను వారి నవలలో కళ్ళకు కట్టినట్టు చూపుతారు. 'సత్యవతీచరిత్ర'లో సావిత్రి తండ్రి కన్యాశుల్కానికి ఆశపడి ఆమెను చిన్నతనంలోనే ముసలివాడికి కట్టబెట్టడం, ఆమె ఇంకా తెలిసీ తెలియని వయసులో వుండగానే, ఆ భర్త మృత్యువు వాతపడడం, భర్త ఆస్తిలో వాటా కోరుతూ కోర్టులో దావా వేసిన సావిత్రమ్మకు వ్యభిచారాన్ని అంటగట్టి, ఆమెకు ఇవ్వవలసిన భరణాన్ని ఎగ్గొట్టడానికి సవతి కొడుకులు ప్రయత్నించడం, ఇవన్నీ ఆనాటి సమాజంలో వితంతు స్త్రీలు ఏవిధంగా అన్యాయానికి లోనయ్యేవారో తెలియపరుస్తాయి.

''మనోవృత్తిని మాన్పించుకొనుటకలు పన్నిన కుతంత్రమే గాని నిజముగా సావిత్రి యెంత మాత్రమును వ్యభిచారిణి కాదు సుమండీ'' అంటూ వీరేశలింగంగారు సావిత్రి పాత్రను జాతితో సమర్థిస్తారు. స్త్రీలు శరీరాన్ని, మనసును, ఇంటినీ, ఏవిధంగా శుభ్రంగా వుంచుకోవాలో, ప్రసవసమయంలో ఆడవాళ్ళు పాటించే మూర్ఖపు ఆచారాల వల్ల వారి ఆరోగ్యాలకూ, శిశువుల ఆరోగ్యాలకు ఏవిధంగా హాని కలుగుతుందో వీరేశలింగం గారు వారి నవలల్లో వివరంగా చెప్పారు. స్త్రీలు మూర్ఖంగా ప్రవర్తించడం, గట్టిగా అరవడం, ఊళ్ళో వాళ్ళందరికీ ఇంటి విషయాలు చెప్పడం, గయ్యాళితనాన్ని ప్రదర్శించడం, కాలాన్ని వృథా కబుర్లతో వెళ్ళబుచ్చడం ఇవన్నీ స్త్రీలకు చదువు లేకపోవడం వల్ల వచ్చినవేనని, స్త్రీలు అభ్యున్నతి గాంచిన నాడే, సమాజం ముందుకు నడుస్తుందనీ, స్త్రీల సంక్షేమాన్ని పట్టించుకోకుండా సమాజమూ, దేశమూ ఎంతగా అభివృద్ధి సాధించినా, అది వెనకబడినట్లే భావించవలసి వుంటుందనీ ఆయన గట్టిగా స్పష్టం చేశారు. స్త్రీల అభివృద్ధికీ, విద్యావికాసాలకు తన జీవితాన్ని పణంగా పెట్టిన మహనీయుడు వీరేశలింగం గారు. వితంతు పునర్వివాహాలను అతిసాహసంతో జరిపించిన వ్యక్తి ఆయన. మొట్టమొదటి బాలికా పాఠశాలను స్థాపించి స్త్రీవిద్యను ఆచరణ సాధ్యంగా ప్రోత్సహించిన మహామనిషి వీరేశలింగం పంతులుగారు. అనాడు స్త్రీలు ఎదుర్కొన్న సమస్యలన్నింటికీ పరిష్కారంగా స్త్రీ విద్యను, స్త్రీ స్వాతంత్ర్యాన్ని సూచించిన పంతులు గారు 'సంఘ దురాచార నివారణకు స్త్రీవిద్య యత్యావశ్యకమని' నొక్కి చెప్పారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు కూడా వీరేశలింగంగారి బాటలోనే నడచి, స్త్రీల అభ్యున్నతికి కృషి చేసిన మహామహుడు. 'విద్య పురుషులకెంత యవసరమో స్త్రీలకు కూడా అంతే అవసరమ'ని అభిప్రాయపడిన చిలకమర్తివారు 'స్త్రీకి విద్య గౌరవనీయమే కానీ, నింద్యము కాద'ని దేశీయులకు ప్రబోధించారు. వారి మేనకోడలు రాపూరి వెంకట సుబ్బమ్మ చిన్నవయసులోనే భర్తను కోల్పోయి, పసిబిడ్డతో చిలకమర్తి వారి పంచన చేరగా, వారు ఆమెకు సంస్కృతాంధ్ర భాషలను బోధించి, ఆంధ్ర విశ్వవిద్యా పరిషత్ పరీక్షకు పంపగా, ఆమె 1928వ సంవత్సరంలో ఉభయభాషా ప్రవీణ పరీక్ష కృతార్థురాలైందని చెబుతూ 'ఆంధ్రవిశ్వవిద్యాపీఠమున నీ పట్టము పొందిన మొదటి స్త్రీ నా మేనకోడలే అయినందుకు నేను సంతోషించుటయేగాక గర్వించుచున్నానం'టారు లక్ష్మీనరసింహం గారు. 'స్త్రీలు లోకజ్ఞానము కొరకు నాంగ్ల విద్య నభ్యసించవచ్చును గాని, మన భారత జాతి కట్టుబాట్లను విసర్జింపక వాటిననుసరించి కాలానుగుణంగా పనిచేయుట కర్తవ్యమని' ప్రబోధించారు. వారి 'రామరత్నం' నవలలో ఆడపిల్లల పెళ్ళిళ్ళ నిమిత్తం అప్పులపాలైన గృహస్థుల కష్టాలు, అమాయకులైన బాలికలు అత్తింటి ఆరళ్ళ ననుభవించడం, డబ్బు కాశించి, కొడుక్కు మరో పెళ్ళి చేయాలనే దురుద్దేశ్యంతో మామగారు కోడలికి పెరుగులో పాషాణాన్ని కలిపి తినిపించి, హత్య చేయాలని కుట్రపన్నడం మొదలైనవి గమనిస్తే, చిలకమర్తివారు స్త్రీల సమస్యలని ప్రత్యేకంగా ఎత్తి చూపకపోయినా, పురుషాధిక్యత వేళ్ళూనుకున్న ఆనాటి కుటుంబాలలో, కోడళ్ళను హత్యచేయడానికి పాల్పడే అమానుషం మన కళ్ళకు కడుతుంది.

1919 సంవత్సరంలో వ్రాసిన ఈ నవలలో వర్ణించిన స్త్రీల దుస్థితి దాదాపు 80 ఏళ్ళు గడిచిపోయినా, స్త్రీలు విద్యావంతులై, అన్నిరంగాలలోనూ అభివృద్ధి సాధించినా ఈ నాటికీ కాస్త అటూఇటూగా అదేవిధంగా వుంది. చిలకమర్తి వారి 'గణపతి' హాస్య స్ఫోరకమైన నవల. ఈ నవలలో కూడా స్త్రీల సమస్యలని వేటినీ పేరుపెట్టి వ్రాయకపోయినా, బాల్య వివాహాలు, కన్యాశుల్కం మొదలగు ఆనాటి దురాచారాలను అడుగడుగునా వివరించారు. అప్పటి రోజుల్లో ఇంకా పుట్టక, కడుపులోనే వున్న ఆడపిల్లలకు సంబంధాలను నిర్ణయించడం, మూడు నాలుగేళ్ళ పిల్లలకు ముసలి వాళ్ళతో కన్యాశుల్కం పుచ్చుకుని పెళ్ళిళ్ళు జరిపించడం, అభం శుభం తెలియని కన్న కూతురు బాల వితంతువైతే ఆమె ఆస్తిని కన్నతండ్రే మోసంచేసి కాజెయ్యడం, మొదలైన దురన్యాయాలు మనం గమనిస్తాం. మరీ నాలుగేళ్ళు కూడా నిండని బుచ్చిని ఆమె తండ్రి, గణపతి మేనమామ, అప్పులు తీర్చుకొందామన్న ఆశతో నాలుగు వందల రూపాయలు పుచ్చుకొని వడివయసు వాడైన రాయప్ప 'ప్రవాహ పెళ్ళి డబ్బు సంపాదించాడన్న మోజుతో అతనికిచ్చి వివాహం చేయబూనడం, పుల్లయ్య వీధిలో ఆడుకుంటున్న బుచ్చికి ఖర్జూరపు పొట్లం ఆశచూపి, ఎత్తుకుపోయి నిద్రపోతున్న పిల్లకి గణపతి చేత తాళికట్టించడం, ఇవన్నీ పరిశీలిస్తే ముక్కుపచ్చలారని పసిపిల్లలకు డబ్బుకాశించి ఊహ తెలియని వయసులో ముసలివాళ్ళకిచ్చి పెళ్ళిచేసి వాళ్ల గొంతులుకోసే అనాచార ప్రాబల్యం అమానుషంగా కనిపిస్తుంది. ఇంకా స్పష్టంగా ఈ నవలలో కనబడేది పురుషాధిక్యత. చిల్లిగవ్వకూడా కొరగాని గణపతి, తల్లిమీద అధికారాన్ని చెలాయించి ఆమెను జానిసా లెక్కగట్టి కొట్టి తిట్టి హింసించడం, తల్లిని ఇదుపుల్లో వుంచడానికి ప్రయత్నించడం మనకు కనిపిస్తుంది. వీరి రామచంద్ర విజయంలో కూడా బాల్య వివాహాల ప్రసక్తి వున్నది.

విశ్వనాథ సత్యనారాయణగారి చేతిలో తెలుగు నవల పరిపుష్టత సంతరించుకుంది. మానవ జీవితాన్ని వేయి ముఖాలుగా సాహిత్యంలో దర్శనం చేయించిన విశ్వనాథవారు స్త్రీని సనాతన హైందవ ధర్మానికి ప్రతీకగా మాత్రమే వీరి నవలల్లో చిత్రీకరించారు. కుటుంబంలో పితృస్వామ్య వ్యవస్థా ధర్మాలకు అనుగుణంగా ఆడపిల్లల పెంపకం వుండాలన్న విశ్వనాథ, వారి 'వేయిపడగలు'లో బాల్య వివాహాలను సమర్థిస్తూ ఎనిమిది తొమ్మిదేళ్ళ చిన్న వయసులోనే ఆడపిల్లలకు జ్ఞానంవచ్చి కాబోయే భర్తపట్ల ఊహలు పెంచుకోవడం జరుగుతుంది కాబట్టి, వారి ఆలోచనలనూ, ఊహలనూ, ఏక పురుష లగ్నం చేయడానికి బాల్య వివాహాలు అవసరం అని వాదిస్తారు. 'శారదా చట్టము వచ్చిన తరువాత ఇకనూ పాతివ్రత్య మేమిటి' అంటూ ఈసడిస్తుంది 'వేయి పడగలు'లో అనసూయ. స్త్రీలు వివాహ విషయంలో స్వాతంత్ర్యాన్ని ప్రదర్శించడం ఖండిస్తూ చెలియలికట్ట, నవలలో "నీమేనమామ నీ యిష్టములేకుండా నీకు పెండ్లి చేసెదందువు. అతడు నీ యిష్టమునడిగి ఇన్ని పెంపా నీకు రైకలు, పరికిణీలు నీ యిష్టమడిగి తెచ్చెనా అంటూ సరస్వతి పాత్రద్వారా ప్రశ్నింపజేసి, స్త్రీల బాగోగులు పురుషులెలాగూ చూస్తారు కనుక, వారికి స్వాతంత్ర్యం అనవసరం అన్నధోరణి వ్యక్తం చేస్తారు. 'భూత భవిష్య ద్వర్తమాన పురుషులందరు గూడి యొక సభ జేసి స్త్రీలను బాధించుటకు పన్నుగడలు పన్నలేదు. సంప్రదాయముగ నొక యాచారము వచ్చుచున్నది గాని" అంటూ కుటుంబ వ్యవస్థలో స్త్రీల అణచివేతను సంప్రదాయంగా అభివర్ణిస్తారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనుకోరి, సంప్రదాయానికి వ్యతిరేకంగా భర్తను వంచించిన జేస్యులు భార్య మంగమ్మ (వేయిపడగలు) ముసలివాడైన భర్తను ఏవగించుకుని స్వతంత్ర భావాలతో చదువుకొన్న మదిరితో లేచిపోయిన రత్నావళి (చెలియలికట్ట) భర్త పిశాచానికి ఇష్టం లేకుండా పునర్వివాహం చేసుకున్న వితంతువు వసుంధర (స్వర్గానికి నిచ్చెనలు) ఇట్లా వారి నవలలో సంప్రదాయానికి ఎదురుతిరిగిన పాత్రలకు విశ్వనాథవారు జీవితమంతా పశ్చాత్తాపాన్ని కొండకచో మరణాన్ని శిక్షగా విధించారు. విశ్వనాథుడు 'వేయిపడగలు' నవలలో స్త్రీ విద్యను నిరసిస్తూ 'ఆమె మూడవ ఫారము చదువుకొన్నదట! ఆమె గర్వము భూమ్యాకాశములు పట్టుట లేదని ఈసడిస్తారు. మళ్ళీ ఆయనే 'చెలియలికట్ట' నవలలో నీలాంబరుడిచే 'స్త్రీలు చదువుకొనవలయును. తల్లి పండితురాలైనచో పిల్లలకెన్నో విషయములను చెప్పవచ్చును. ఆమెకు (రత్నావళికి) పూర్వమే ఈ చదువు వచ్చినచో నట్టి పాపకృత్యము చేసెడిది గాదు' అంటూ తల్లికి జాబు వ్రాయిస్తారు.

పతితురాలైన మంగమ్మ 'విద్యా విహీనురాలి ఇంట పుట్టి జ్ఞానం లేకపోవడం వల్లనే తానట్లా అయినానని చింతిస్తుంది. అయితే విశ్వనాథ వారు సమర్థించిన చదువు ఇంగ్లీషు చదువు కాదు. సాంప్రదాయాలను అర్థం చేసుకోవడానికి స్త్రీలకు పనికివచ్చే విద్య మాత్రమే. విశ్వనాథ బాల్య వివాహాలను సమర్థించారు. వితంతు వివాహాలను గర్హించారు. అయితే వితంతువులు చదువుకొని సంపాదించుకోవాలన్న విషయాన్ని సమర్థించారు. స్త్రీ విద్యను నిరసించారు. అసలు ఆయన స్త్రీలకు సమస్యలున్నట్లే పరిగణించలేదు. సమాజంలో అనాటి స్త్రీ దైన్య స్థితిని విశ్వనాథ 'ఒకానొక ఆచారము' గానే సమర్థించారని చెప్పుకోవచ్చు.

'అంతర్గతమైన భావదాస్యం నుంచి విముక్తి పొందకుండా స్త్రీ స్వాతంత్ర్యాన్ని పొందడం దుర్లభం' అని సిద్ధాంతీకరించిన చలంగారు సమాజంలోని స్త్రీల దౌర్భాగ్య స్థితికి కరిగిపోయి 'స్త్రీకి కూడా శరీరం వుంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు వుంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకి హృదయం వుంది. దానికి అనుభవం ఇవ్వాలి' అని గుర్తించి సరికొత్త ప్రభంజనాన్ని లేపారు. 1921లో చలం వ్రాసిన మొదటి నవల 'శశిరేఖ'లో బలవంతంగా తనకు బాల్య వివాహం చేసిన పెద్దలనూ, భర్తను నిరసించి తను ప్రేమించిన కృష్ణుడితో వెళ్లిపోతుంది శశిరేఖ.

'దైవమిచ్చిన భార్య'లో పద్మావతి తనకు తెలిసీ తెలియని వయసులో న్యాయపతితో వివాహం జరిగినా, తాను ప్రేమించిన రాధాకృష్ణను వదులుకోలేకపోయింది. 'వివాహం' నవలలో రమణపట్ల గోపాలరావు ప్రదర్శించిన దౌష్ట్యం వివాహ వ్యవస్థలోని లొసుగులను ఎత్తి చూపుతుంది. 'మైదానం' నవలలో రాజేశ్వరి తన సౌందర్యం పట్లా, అనుభూతుల పట్ల స్పందనలేని భర్తను వదిలేసి తన కిష్టమైన అమీర్‌తో స్వేచ్ఛా ప్రణయాన్ని నెరపుతుంది. 'అరుణ'లో భర్త, అత్తగార్ల శాసిస్తు ప్రవర్తనకు విసిగిపోయిన అరుణ సంప్రదాయానికి ఎదురు తిరుగుతుంది. 'బ్రాహ్మణీకం' నవలలో మూఢాచారాలకు, మూర్ఖసంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన సుందరమ్మ పాపభీతితో తనను తానే కాక, తను వివాహం చేసుకున్న భర్తను, తన కడుపునపుట్టిన బిడ్డనూ కూడా ఇబ్బందులకు లోనుచేస్తుంది. స్త్రీ స్వాతంత్ర్యాన్ని చలం వేయి రూపాలలో అభివర్ణించారు. మహిళల చైతన్యాన్ని, విద్యను, వారి స్వంత సంపాదనను ప్రోత్సహించారు. పురుషాధిక్యతకూ, కుటుంబ హింసకూ ఆలవాలమైన వివాహ వ్యవస్థను తీవ్రంగా విమర్శించారు. చలంగారు స్త్రీ విద్య వాళ్ల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు స్వావలంబనకూ దోహదంచేస్తుందని చెప్పారు.

సమస్త జీవరాసులూ తమ జీవనం తామే సంపాయించుకుంటూ వుండగా లోకంలోకెల్లా ఒక్క స్త్రీ మాత్రం తన జీవనంకోసం ఎంత నీచంగా పురుషుడి కాళ్ళు పట్టుకుంటోంది అంటారు చలం. 'స్త్రీ స్వాతంత్ర్యానికి సాంఘికాచారాలను పరిష్కరించుకోవడం ఒక్కటే మార్గం' -ఇది చలం చూపిన పరిష్కారం.

కలాన్ని కుంచెగా మలిచి, సాహిత్యాన్ని దృశ్యమానంగా తీర్చిదిద్దిన అద్భుత నవలా రచయిత అడవి బాపిరాజు గారు. 'స్త్రీని లక్ష్మీ లాగా, వస్తువులాగా చూడక మనుషుల్లాగా చూడాలన్న అవగాహనను ఆయన [illegible] వ్యక్తం చేశారు. వీరి 'నారాయణరావు' [illegible] ఆనాటి సమాజంలో సమకాలీనంగా కందుకూరి వీరేశలింగంగారు చేపట్టి నిర్వహిస్తున్న సాంఘిక సంస్కరణ కార్యక్రమాల ప్రసక్తి అక్కడక్కడ చోటుచేసుకోవడం మనం గమనిస్తాం. వివాహ వ్యవస్థ పవిత్రమైనదని ఒకపక్క అంగీకరిస్తూనే ఆ వ్యవస్థలో వున్న లోపాలవల్ల స్త్రీ విషమ పరిస్థితుల నెదుర్కోవలసి వస్తున్నదన్న వేదనను వ్యక్తం చేశారు.

స్త్రీల ఇంటి చాకిరి అర్థంలేని వ్యర్థ కార్యక్రమం అన్న అభిప్రాయాన్ని వ్యక్తపరిచి తమ కాలాన్ని విద్యనభ్యసించడం, లలిత కళలు నేర్చుకోవడం ద్వారా సద్వినియోగం చేసుకోవాలన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు బాపిరాజు గారు. స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతం అనుసరించడం వల్ల స్త్రీ జాతికి కష్టాలేతప్ప జరిగేదేమీ లేదని 'నారాయణరావు' నవలలో పుష్పశీల పాత్రద్వారా తెలియచెప్పారు. బాల్యవితంతువైన మహిళ పునర్వివాహంచేసుకోవడానికి అంగీకరించక, అది చాలా పాపకార్యంగా భావించి అనుభవించే మానసిక సంఘర్షణను 'కోనంగి' నవలలో చిత్రీకరిస్తారు. బాపిరాజుగారు సమాజంలో స్త్రీ విషయకంగా జరుగుతున్న బాల్య వివాహాల వ్యతిరేకత, వితంతు పునర్వివాహాలు, స్త్రీ విద్య ఇత్యాది సంస్కరణలను ఒకవైపు ఆమోదిస్తూనే, కట్టుబాట్లు, నియమాలు, నిజమైన స్వేచ్ఛ. స్త్రీ కూడా దేశానికి, ప్రపంచానికి అభ్యుదయ కృషిని అర్పించాలి. అది నియమాలతో జరగాలి. రైలుపట్టాలు తప్పితే రైలుకు స్వేచ్ఛ లేదు' అంటారాయన 'తుపాను' నవలలో. రష్యాలో స్త్రీల చైతన్యాన్ని ఆదర్శంగా తీసుకోవాలని వారి నవలలలో ప్రబోధిస్తారు.

'స్త్రీ పొగడ్త వాంఛిస్తుంది. మెప్పుకోలుకు ఉబ్బిపోతుంది. చిరుకోకలతే [illegible]. పెద్దకోర్కెలను బంగారు [illegible] పెట్టెలలో పెట్టి అడుగున దాచుకుంటుంది. మనసు పసిఫిక్కు లోతులలో దాచుకుంటుంది. మగవాడి జీవిత పథాలలో కప్పివేస్తుంది. ఇదీ స్త్రీ పట్ల బాపిరాజుగారి అభిప్రాయం.

'బావా! మనదేశ స్త్రీలెంత గౌరవనీయులోయి మన నాగరికతను, మన గౌరవాన్ని మన నీతిని, జాతిని కాపాడుతున్నది ఆడవాళ్లోయ్' అని నారాయణరావు పాత్రద్వారా చెప్పిస్తారు.

ఇంకా తొలితరం రచయితలలో స్త్రీల సమస్యలను స్పృశిస్తూ నవలా రచన చేసిన వారిలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గోపీచంద్, వెంకట పార్వతీశ్వర కవులు మొదలైన ఎందరో ప్రముఖ రచయితలు వున్నప్పటికీ సూటిగా మహిళా సమస్యలను వారి నవలలలో చర్చించి, స్త్రీ విషయకమైన సంస్కరణలు ఆనాటి సంఘంలో చోటు చేసుకుంటున్న నేపథ్యంలో అనుకూలంగానో, ప్రతికూలంగానో తీవ్రంగా స్పందించిన రచయితల నవలలలో వారు మహిళల సమస్యల పట్ల వెలిబుచ్చిన అభిప్రాయాలను మాత్రమే పరిగణించడం జరిగింది. మొత్తం మీద రచయితలందరూ (ఎవరో ఒకరిద్దరు తప్ప) స్త్రీవిద్యను ప్రోత్సహించారు. బాల్య వివాహాలను గర్హించి, వితంతు పునర్వివాహాలను సమర్థించారు. స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు తమదైన చేయూత నిచ్చారు.

– డాక్టర్ ఎం. కనకదుర్గ

ఐనా...

భయాందోళనల మధ్య
ఏ నమ్మకం
ఆ ఒడ్డుకి చేరుస్తుంది
నిరంతర ప్రయాసలోనైనా
ప్రయత్నం కొనసాగుతుంది
అదిగో
అన్ని రూపాల్లో
ఏదో ఒకటి
నిజ స్వరూపమంటూనే నవ్వేస్తుంది
రాత్రంతా మాటాడుకున్నా
ఉదయానికింకా తెగని సంభాషణలా
గాలి గుసగుసలతోబాటు
వెలుగు చీకటి ఆలాపన
అలా నిశ్శబ్దంగా చూస్తూ నిలబడ్డ
గోడలు కూడా మాటాడితే
ఎంత బాగుణ్ణు!
మొదలైనాక
ఆగని ఆలోచనా చక్రం
గాలిలో అల్లల్లాడుతూ
ఒక్కొక్కటిగా
ఆకులు ఎగిరిపోతున్నాయి
చెట్లో పండిన జాంపండు
కనిపిస్తోందిప్పుడు
చెంకలజారిన పడకముందే
చిన్న చిన్న ముక్కలుగానైనా
అందరికీ చేర్చాలి

–వై.ముకుంద రామారావు

కొంటూరు కందుకాల త్రవ్వకం, ఆటవీ ప్రాంత